भारत का राजपत्र
The Gazette of India

భారత రాజపత్రము

असाधारण

EXTRAORDINARY

అసాధరణ

भाग XVI अनुभाग 1

**Part XVI Section 1**

భాగము XVI అనుభాగము 1

प्राधिकरण द्वारा प्रकाशित

**PUBLISHED BY AUTHORITY**

ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १ | नई दिल्ली | गुरूवार | १८ जुलाई, २०१९ | आषाढ़ | खंड |
| No.1 | New Delhi | Thursday | 18 July, 2019 | Ashada | Vol.1 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | గురువారం | 18 జూలై, 2019 | ఆషాఢము | సంపుటము.1 |


MINISTRY OF LAW AND JUSTICE
(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 20th June, 2019

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Central Universities Act, 2009 (25 of 2009), (2) The Nalanda University Act, 2010 (39 of 2010), (3) The Prohibition of Employment as Manual Scavengers and their Rehabilitation Act, 2013 (25 of 2013) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) కేంద్రీయ విశ్వవిద్యాలయముల చట్టము, 2009 (2009లోని 25వ చట్టము), (2) నలందా విశ్వవిద్యాలయ చట్టము, 2010 (2010లోని 39వ చట్టము), (3) హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా ఉపాధిని కల్పించుటపై నిషేధము మరియు వారి పునరావాస చట్టము, 2013 (2013లోని 25వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా ఉపాధిని కల్పించుటపై నిషేధము మరియు వారి పునరావాస చట్టము, 2013.

## (2013లోని 25వ చట్టము)

(18 సెప్టెంబరు, 2013)

హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా ఉపాధిని కల్పించుటపై నిషేధము మరియు హస్త పారిశుద్ధ్యపని చేయువారికి, మరియు వారి కుటుంబములకు పునరావాసము కల్పించుటకు, మరియు అందుకు సంబంధించిన లేదా దాని ఆనుషంగికమైన విషయములను నిబంధించుటకైన చట్టము.

వైయుక్తిక గౌరవమును చేకూరుస్తూ పౌరులలో సౌభ్రాతృత్వమును పెంపొందించుట, సంవిధానపు ప్రస్తావనలోని లక్ష్యాలలో ఒకటిగా ప్రతిష్ఠాపించబడినదైనందుననూ;

సంవిధానపు భాగము-3లో హామీనివ్వబడిన ప్రాథమిక హక్కులలో గౌరవముగా జీవించు హక్కు ఒసగబడినందుననూ;

ఇతర విషయములతో పాటుగా బలహీన వర్గములను మరియు ప్రత్యేకముగా అనుసూచిత కులములు మరియు అనుసూచిత జనజాతులను సామాజిక అన్యాయం మరియు దోపిడికి సంబంధించిన అన్ని రూపముల నుండి రాజ్యము రక్షించవలెనని సంవిధానపు 46వ అనుచ్ఛేదము నిబంధిస్తున్నందుననూ;

దేశములోని వివిధ ప్రాంతములలో అవివేకముతో కూడిన, అత్యంత అన్యాయపూరితమైన వర్గ వ్యవస్థ ఇంకనూ కొనసాగుతున్నందువలన, హస్త పారిశుద్ధ్యము చేయుట వంటి అమానవీయకరమైన పద్ధతులు ఇంకనూ ఉన్నందున, అనారోగ్యకరమైన మరుగుదొడ్లు మరియు హస్త పారిశుద్ధ్యమనే జంట దురవస్థలను తొలగించుటకై ప్రస్తుతమున్న శాసనములు తగినట్లుగా లేవని నిరూపించబడుతున్నందుననూ;

హస్త పారిశుద్ధ్యపని చేయువారిపట్ల జరుగుతున్న చారిత్రకమైన అన్యాయము మరియు అగౌరవములను సరిదిద్దవలసిన మరియు గౌరవప్రమైన జీవనమును సాగించడానికి వారికి పునరావాసం కల్పించవలసిన ఆవశ్యకత ఉన్నందుననూ;

భారత గణరాజ్యపు అరవై నాలుగవ సంవత్సరములో, పార్లమెంటు ఈ క్రింది విధముగా శాసనము చేసినది:-

## అధ్యాయము-1
## ప్రారంభిక

1. (1) ఈ చట్టమును హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా ఉపాధిని కల్పించుటపై నిషేధం మరియు వారి పునరావాస చట్టము, 2013 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము, విస్తరణ, మరియు ప్రారంభము.

(2) ఇది, జమ్మూ మరియు కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమంతటికిని విస్తరించును.

(3) ఇది, కేంద్ర ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయు నట్టి తేదీన అమలు లోనికి వచ్చును:

అయితే అట్లు అధిసూచించబడిన తేదీ, అధికారిక రాజపత్రంలో సదరు అధిసూచనను ప్రచురించిన తేదీ తర్వాత అరవై దినముల కన్నా ముందుదై ఉండరాదు.

2. (1) ఈ చట్టములో సందర్భమును బట్టి అర్థము ఇతర విధముగా ఉన్ననే తప్ప,- నిర్వచనములు.

(ఎ) "ఏజెన్సీ" అనగా ఏదేని ప్రాంతములో పారిశుద్ధ్య పదుపాయములను చేపట్టబడు, స్థానిక ప్రాధికార సంస్థ కానట్టి ఏదేని ఏజెన్సీ అని అర్థము మరియు ఈ పద పరిధి యందు భూసంపద (రియల్ ఎస్టేటు)

అభివృద్ధి మరియు నిర్వహణలో నిమగ్నమైన ఒక గుత్తేదారు (కాంట్రాక్టరు) లేదా ఒక ఫర్మ్ లేదా ఒక కంపెనీ చేరి యుండును;

(బి) కంటోన్మెంట్ బోర్డులు, రైల్వే భూములు మరియు కేంద్ర ప్రభుత్వము, ఒక కేంద్ర ప్రభుత్వరంగ అధీన సంస్థ లేదా కేంద్ర ప్రభుత్వముచే పూర్తిగా లేదా తగిన సహాయం పొందుతున్న స్వయం ప్రతిపత్తి నికాయము యాజమాన్యము వహించు భూములు మరియు భవనములకు సంబంధించినంత వరకు "సముచిత ప్రభుత్వము" అనగా కేంద్ర ప్రభుత్వము, మరియు అన్ని ఇతర సందర్భములలో రాజ్య ప్రభుత్వము అని అర్థము;

(సి) పురపాలిక లేదా పంచాయితీకి సంబంధించి "ముఖ్య కార్యపాలకాధికారి" అనగా ఏ పేరుతో పిలువబడినప్పటికినీ అత్యంత సీనియరు కార్యపాలకాధికారి అని అర్థము;

(డి) మురుగు కాలువ లేదా మానవ వ్యర్థాల గుంతకు (సెప్టిక్ ట్యాంకు) సంబంధించి ఉద్యోగితో "హానికారకమైన పరిశుభ్రత చేయించుట" అనగా రక్షణ పరికరములు మరియు ఇతర పరిశుభ్రము చేయు సాధనములను సమకూర్చుటలోను మరియు తత్సమయమున అమలులో ఉన్న ఏదేని ఇతర శాసనము లేదా దాని క్రింద చేయబడిన నియమముల క్రింద విహితపరచబడిన లేదా నిబంధించబడినట్టి రక్షణ చర్యలను పాటించునట్లు చూడడంలోను యజమాని తన యొక్క బాధ్యతలను నెరవేర్చనపుడు, ఉద్యోగి అట్టి వాటిని హస్తముతో పరిశుభ్రము చేయుట అని అర్థము;

(ఇ) "అనారోగ్యకరమైన మరుగుదొడ్డి" అనగా విసర్జకాలు పూర్తిగా కుళ్ళి పోవుటకు ముందు, మానవ విసర్జకాలు విసర్జించబడిన లేదా ప్రవహింపజేయబడిన విసర్జకాలను యథాస్థానంలో లేదా తెరిచివుండే మురుగు కాలువ లేదా గుంటను విహితపరచబడునట్టి రీతిలో లేదా ఇతర

విధముగా హస్తముతో పరిశుభ్ర పరచవలసియున్న మురుగు దొడ్డి అని అర్థము:

అయితే, ఈ విషయములో కేంద్ర ప్రభుత్వము అధిసూచించునట్టి సాధనములను మరియు రక్షక పరికరములను ఉపయోగించుట ద్వారా ఉద్యోగిచే రైల్వే ప్రయాణికుల భోగీలలోని మురుగు దొడ్డిని నీటి ప్రవాహపు సహాయముతో పరిశుభ్రము చేయించినపుడు, దానిని అనారోగ్యకరమైన మురుగుదొడ్డిగా భావించరాదు.

(ఎఫ్) "స్థానిక ప్రాధికార సంస్థ" అనగా,-

(i) సంవిధానపు 243 పీ అనుచ్ఛేదములోని ఖండము (ఇ) మరియు ఖండము (ఎఫ్)లో నిర్వచించినట్లుగా దాని యొక్క అధికారిత పరిధిలోని పారిశుద్ధ్యమునకు బాధ్యత వహించు ఒక పురపాలిక లేదా ఒక పంచాయితీ;

(ii) కంటోన్మెంట్ల చట్టము, 2006లోని 10వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటయిన ఒక కంటోన్మెంటు బోర్డు; మరియు 2006లోని 41వది.

(iii) రైల్వే ప్రాధికార సంస్థ అని అర్థము ,-

(జి) "హస్త పారిశుద్ధ్యము చేయువాడు" అనగా విసర్జకాలు పూర్తిగా కుళ్ళి పోవుటకు ముందు, మానవ విసర్జకాలు విసర్జించబడిన లేదా ప్రవహింపజేయబడిన విసర్జకాల యొక్క అనారోగ్యకరమైన మురుగుదొడ్డి లేదా తెరిచివుండే మురుగు కాలువ లేదా గుంట లేదా రైల్వే మార్గము లేదా కేంద్ర ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వము అధిసూచించునట్టి ఇతర ప్రదేశములు లేదా ఆవరణల నుండి మానవ విసర్జకాలను హస్తంతో పరిశుభ్రము చేయుటకు, తీసుకొని పోవుటకు, వ్యయనము చేయుటకు లేదా ఏదేని ఇతర రీతిలో వ్యవహరించుటకు ఈ చట్టపు ప్రారంభమున లేదా దాని తరువాత ఏ సమయములోనైనను వైయుక్తికముగా లేదా స్థానిక ప్రాధికారము లేదా ఏజెన్సీ

లేదా కాంట్రాక్టరుచే నియోగించబడిన లేక నియుక్తుడైన ఒక వ్యక్తి అని అర్థము మరియు "హస్త పారిశుద్ధ్యము చేయుట" అను పదబంధమును తదనుసారముగా అన్వయించుకొనవలెను.

విశదీకరణ:- ఈ ఖండపు ప్రయోజనము కొరకు,-

(ఎ) "నియోగించబడిన లేక నియుక్తుడైన" క్రమబద్ధ (రెగ్యులరు) లేదా కాంట్రాక్టు ప్రాతిపదిక మీద నియోగించబడిన లేదా నియుక్తుడైన అని అర్థము;

(బి) ఈ విషయములో కేంద్ర ప్రభుత్వం అధిసూచించునట్టి సాధనముల సహాయంతో లేదా రక్షిత పరికరములను ఉపయోగించి విసర్జకాలను శుభ్రం చేయుటకై నియోగించబడిన లేదా నియుక్తుడైన వ్యక్తిని హస్త పారిశుద్ధ్య పనిని చేయువానిగా భావించరాదు;

(హెచ్) "సఫాయి కర్మచారీల జాతీయ కమీషను" అనగా సఫాయి కర్మచారీల జాతీయ కమీషను చట్టము, 1993లోని 3వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడి, భారత ప్రభుత్వ సామాజిక న్యాయ మరియు సాధికారిత మంత్రిత్వశాఖ వారి 24 ఫిబ్రవరి, 2004 తేదీ గల నెం.17015/18/2003 - ఎస్‌సీడీ-VIలోని తీర్మానం ద్వారా కొనసాగించబడుతున్న మరియు ఆయా సమయములందు సవరించబడినట్లుండు సఫాయి కర్మచారీల కొరకైన జాతీయ కమీషను అని అర్థము;

1993లోని 64వది.

(ఐ) "అధిసూచన" అనగా అధికారిక రాజపత్రములో ప్రచురించిన అధిసూచన అని అర్థము మరియు "అధిసూచిత" అను పదబంధమును తదనుసారంగా అన్వయించుకొనవలెను;

(జె) అనారోగ్యకరమైన మరుగు దొడ్డి ఉన్న లేదా హస్త పారిశుద్ధ్యము చేయువానిగా ఒక వ్యక్తిని నియోగించిన ఆవరణకు సంబంధించి "స్వాధీన

దారుడు" అనగా తత్సమయమున అట్టి ఆవరణలో నివాసముంటున్న వ్యక్తి అని అర్థము;

(కె) అనారోగ్యకరమైన మరుగు దొడ్డి ఉన్న లేదా హస్త పారిశుద్ధ్య పని చేయువానిగా ఒక వ్యక్తిని నియోగించబడిన ఆవరణకు సంబంధించి "సొంతదారు" అనగా తత్సమయమున అట్టి ఆవరణకు న్యాయబద్ధమైన హక్కు మూలము కలిగివున్న వ్యక్తి అని అర్థము;

(ఎల్) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమముల ద్వారా విహితపరచబడిన అని అర్థము;

(ఎమ్) "రైల్వే ప్రాధికార సంస్థ" అనగా ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వముచే అధిసూచించబడినట్టి రైల్వే భూమిని నిర్వహిస్తున్న ప్రాధికార సంస్థ అని అర్థము;

(ఎన్) "రైల్వే భూమి" అను పదమునకు రైల్వేల చట్టము, 1989లోని 2వ పరిచ్ఛేదపు ఖండము (32ఏ)లో దానికి ఈయబడిన అర్థమునే కలిగివుండును. 1989లోని 24వది.

(ఒ) "ఆరోగ్యకరమైన మరుగుదొడ్డి" అనగా "అనారోగ్యకరమైన మరుగుదొడ్డి" కానట్టి మరుగుదొడ్డి అని అర్థము;

(పి) "మానవ వ్యర్థాల గుంత (సెప్టిక్ ట్యాంకు)" అనగా మానవ విసర్జకాలు నిలువ చేయుటకు, దానిలో బాక్టీరియ చర్య ద్వారా సాధారణంగా భూగర్భంలో ఏర్పాటు చేయబడి, నీరు కారకుండా ఉండు కందకము లేదా భూగర్భతొట్టి అని అర్థము;

(క్యూ) "మురుగు కాలువ" అనగా వ్యర్థములు మరియు మురుగు నీటి పారుదల వ్యర్థములలో పాటుగా మానవ విసర్జకాలను తీసుకొనిపోవు భూగర్భ వాహక నాళము లేక గొట్టము అని అర్థము;

(ఆర్) ఒక సంఘరాజ్య క్షేత్రమునకు సంబంధించి "రాజ్య ప్రభుత్వము" అనగా సంవిధానపు 239వ అనుచ్ఛేదము క్రింద నియమించబడిన పాలకుడు అని అర్థము;

(ఎస్) "సర్వే" అనగా 11వ పరిచ్ఛేదము లేదా 14వ పరిచ్ఛేదమును పురస్కరించుకొని హస్త పారిశుద్ధ్యపని చేయువారికై చేపట్టబడిన సర్వే అని అర్థము.

2006లోని 41వది.

(2) ఈ చట్టములో ఉపయోగించిన మరియు నిర్వచింపబడని పదములు మరియు పదబంధములకు కంటోన్మెంట్ల చట్టము, 2006లో వరుసగా వాటికి ఈయబడిన అర్థములనే కలిగి యుండును.

(3) ఈ చట్టపు అధ్యాయములు 4 నుండి 8ల క్రింద పురపాలికకు చేయబడిన నిర్దేశములో కంటోన్మెంటు బోర్డు మరియు రైల్వే భూమి అధికారితా పరిధిలోని అయా ప్రాంతములలో చేర్చిన ప్రాంతములకు సంబంధించి వరుసగా కంటోన్మెంటు బోర్డు లేదా సందర్భానుసారముగా రైల్వే ప్రాధికార సంస్థకైన నిర్దేశము చేరియుండును.

చట్టము అధిగమించు ప్రభావము కలిగియుండుట.
1993లోని 46వది.

3. హస్త పారిశుద్ధ్య పని చేయువారి ఉపాధి కల్పన మరియు శుష్క (డ్రై) మరుగుదొడ్ల నిర్మాణ (నిషేధ) చట్టము, 1993 లేదా ఏదేని ఇతర శాసనము లేదా ఏదేని ఇతర శాసనము వలన ప్రభావము కలిగియున్న ఏదేని పత్రములో అసంగతముగా ఏమివున్నప్పటికినీ, ఈ చట్టపు నిబంధనలు ప్రభావమును కలిగి వుండును.

## అధ్యాయము -2
## అనారోగ్యకరమైన మరుగుదొడ్ల గుర్తింపు

4. (1) ప్రతీ స్థానిక ప్రాధికార సంస్థ,- అనారోగ్యకరమైన మరుగుదొడ్లను స్థానిక ప్రాధికార సంస్థలు సర్వే చేయుట మరియు ఆరోగ్యకరమైన సామాజిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయుట.

(ఎ) ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి రెండు మాసముల కాలావధి లోపల, విహిత పరచబడినట్టి రీతిలో దాని యొక్క అధికారితా పరిధిలో ప్రస్తుతమున్న అనారోగ్యకరమైన మరుగు దొడ్లను సర్వే చేయుట మరియు అట్టి అనారోగ్యకరమైన మరుగు దొడ్ల జాబితాను ప్రచురించుట;

(బి) ఖండము (ఎ) క్రింద జాబితాను ప్రచురించిన తేదీ నుండి పదిహేను దినముల లోపల, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి ఆరు మాసముల కాలావధి లోపల అనారోగ్యకరమైన మరుగు దొడ్డిని కూల్చి వేయడం గాని లేదా ఆరోగ్యకరమైన మరుగుదొడ్డిగా మార్చడం గాని చేయవలసిందిగా సొంత దారునికి నోటీసు ఇవ్వవలెను:

అయితే, స్థానిక ప్రాధికార సంస్థ వ్రాత పూర్వకముగా నమోదు చేయుటకైన తగిన కారణములపై, మూడు మాసములకు మించకుండా సదరు కాలావధిని పొడిగించ వచ్చును;

(సి) ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి తొమ్మిది మాసములకు మించని కాలావధి లోపల అనారోగ్యకరమైన మరుగు దొడ్లు గల ప్రాంతములలో, తాను అవసరమని భావించునట్టి సంఖ్యలో ఆరోగ్యకరమైన సామాజిక మరుగు దొడ్లను నిర్మించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లోని నిబంధనల సాధారణతకు భంగము కలుగకుండా, సముచిత ప్రభుత్వము తన యొక్క అధికారిత పరిధిలో బహిరంగ విసర్జన అలవాటును తొలగించుటకు వీలుగా, అధిసూచన ద్వారా ఈ

చట్టము ప్రారంభమైన తేదీ నుండి మూడు సంవత్సరములకు మించనట్టి కాలావధి లోపల పురపాలికలు, కంటోన్మెంటు బోర్డుల మరియు రైల్వే ప్రాధికార సంస్థలు కూడా చాలినంత సంఖ్యలో ఆరోగ్యకరమైన సామాజిక మరుగు దొడ్లను నిర్మించవలెను.

(3) ఉప-పరిచ్ఛేదములు (1) మరియు (2)లలో నిర్దిష్టపరిచిన ఆరోగ్యకరమైన మరుగు దొడ్లను నిర్మించుటకు మరియు అన్ని వేళలలోను వాటి యొక్క ఆరోగ్యవంతమైన నిర్వహణను కాపాడుటకు ఏర్పాట్లు చేయుటకై స్థానిక ప్రాధికార సంస్థలు బాధ్యత వహించవలెను.

విశదీకరణ:- ఈ పరిచ్ఛేదము యొక్క ప్రయోజనముల కొరకు, రైల్వే ప్రాధికార సంస్థలకు సంబంధించి "సామాజిక" అనగా ప్రయాణీకులు మరియు రైల్వేల సిబ్బంది మరియు ఇతర అధీకృత వాడకపుదార్లు అని అర్థము.

## అధ్యాయము -3

## అనారోగ్యకరమైన మరుగుదొడ్లు మరియు హస్త పారిశుద్ధ్యపని చేయువానిగా ఉపాధి కల్పించుట మరియు నియోగించుటపై నిషేధము.

అనారోగ్యకరమైన మరుగుదొడ్లు మరియు హస్త పారిశుద్ధ్యపని చేయువానిగా ఉపాధిని కల్పించుట మరియు నియోగించుటపై నిషేధము.
1993లో 46వది.

5. (1) హస్తముతో పారిశుద్ధ్యము చేయువారిగా ఉపాధిని కల్పించుట మరియు శుష్క (డ్రై) మరుగుదొడ్ల నిర్మాణ (నిషేధ) చట్టము, 1993లో ఉన్న దానికి అసంగతముగా ఏమి యున్నప్పటికినీ, ఈ చట్టము ప్రారంభమైన తరువాత ఏ వ్యక్తి, స్థానిక ప్రాధికార సంస్థ లేదా ఏదేని ఏజన్సీ, -

(ఎ) అనారోగ్యకరమైన మరుగుదొడ్డిని నిర్మించరాదు; లేదా

(బి) ప్రత్యక్షంగా గాని లేదా పరోక్షంగా గాని హస్త పారిశుద్ధ్యము చేయువానిని నియోగించుట లేదా నియుక్తము చేయుట చేయ రాదు మరియు ఆ విధముగా నియోగించబడిన లేదా నియుక్తము చేయబడిన ప్రతి వ్యక్తి, అభివ్యక్తముగా లేదా అంతర్నిహితముగా

హస్త పారిశుద్ధ్యం చేయుటకైన ఏదేని బాధ్యత నుండి వెంటనే విముక్తుడగును.

(2) ఈ చట్టము ప్రారంభమైన తేదీకి ఉన్నటు వంటి ప్రతి అనారోగ్యకరమైన మరుగుదొడ్డిని, 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (బి)లో నిర్దిష్టపరచబడిన కాలావధి ముగియులోగా స్వాధీనదారుడు తన యొక్క సొంత వ్యయంతో కూల్చి వేయవలెను లేదా ఆరోగ్యకరమైన పారిశుద్ధ్య మరుగు దొడ్డిగా మార్చవలెను:

అయితే, అనారోగ్యకరమైన మరుగు దొడ్డికి సంబంధించి అనేక మంది స్వాధీనదారులు ఉన్నపుడు, దానిని కూల్చి వేయవలసిన లేదా మార్చవలసిన బాధ్యత ఈ క్రింది వారిపై ఉండవలెను,-

(ఎ) స్వాధీనదారులలోని ఒకరు సొంతదారు అయిన సందర్భములో, ఆవరణల సొంతదారు; మరియు

(బి) అన్ని ఇతర సందర్భములలోను ఉమ్మడిగా మరియు విడిగా స్వాధీనదారులందరు:

అయితే, రాజ్య ప్రభుత్వము, అనారోగ్యకరమైన మరుగుదొడ్లను ఆరోగ్యకరమైన మరుగుదొడ్లుగా మార్చుట కొరకు అధిసూచన ద్వారా తాను నిర్దిష్టపరచినట్టి వ్యక్తుల వర్గములు మరియు అట్టి ప్రమాణములపై స్వాధీన దారులకు సహాయము అందించ వచ్చును:

అంతేకాక, రాజ్య ప్రభుత్వము నుండి సహాయము అందనపుడు, అనారోగ్యకరమైన మరుగుదొడ్డిని సదరు తొమ్మిది దినముల కాలావధిని దాటి నిర్వహించక లేదా ఉపయోగించకపోవడము చెల్లదగిన కారణము కాదు.

(3) ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచిన కాలావధి లోపల అనారోగ్యకరమైన మరుగుదొడ్డిని కూల్చివేయుట గాని, ఆరోగ్యకరమైన మరుగుదొడ్డిగా మార్చుటలో గాని ఎవరేని స్వాధీనదారుడు విఫలమైనపుడు

అట్టి అనారోగ్యకరమైన మరుగుదొడ్డి ఉన్న స్థానిక ప్రాధికార సంస్థ, అట్టి మరుగుదొడ్డిని కూల్చి వేయవలసిందిగా లేదా ఆరోగ్యకరమైన మరుగు దొడ్డిగా మార్పవలసినదిగా స్వాధీన దారునికి ఇరవై ఒకటి దినములకు తక్కువ కానట్టి కాలావధికైన నోటీసు ఇచ్చిన తరువాత, విహిత పరచబడినట్టి రీతిలో అట్టి మార్పు చేయుటకైన లేదా సందర్భానుసారం కూల్చి వేయుటకైన వ్యయమును స్వాధీనదారు నుండి వసూలు చేయుటకు హక్కు కలిగి ఉండును.

కాంట్రాక్టు, కర్రారు మున్నగునవి చెల్లకుండా ఉండుట

6. (1) హస్త పారిశుద్ధ్యపని చేయు నిమిత్తం ఒక వ్యక్తికి నియోగించుచూ లేదా నియమించుచూ, ఈ చట్టము యొక్క ప్రారంభపు తేదికి ముందు చేసుకున్న లేదా అమలు జరిపిన ఏదేని కాంట్రాక్టు, కరారు లేదా ఇతర పత్రము, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి సమాప్తము చేయబడవలెను మరియు అట్టి కాంట్రాక్టు, కరారు లేదా ఇతర పత్రము చెల్లనిది గాను మరియు అమలులో లేనిదగును మరియు అందు నిమిత్తం ఎటువంటి పరిహారము చెల్లించదగి ఉండదు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికినీ, పూర్తికాలిక ప్రాతిపదికపై హస్త పారిశుద్ధ్యపని చేయువానిగా నియుక్తం చేయబడిన లేదా నియోగించబడిన ఏ వ్యక్తియు అతని యొక్క యజమానిచే తొలగించబడరాదు, అయితే, అతని యొక్క ఇష్టమునకు అధ్యధీనమై ఉద్యోగములో కనీసం అవే జీతభత్యములపై అతనిని ఉంచవలెను మరియు అతనికి హస్త పారిశుద్ధ్యం చేయుట కానట్టి ఇతర పనిని అప్పగించవలెను.

హానికరమైన మురుగు కాలువలు, మానవ వ్యర్థాల గుంతలను శుభ్రపరచుట కొరకు వ్యక్తులను వినియోగించుట లేదా నియుక్తం చేయుటపై నిషేధము.

7. ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి ఒక సంవత్సరము మించనట్టి కాలావధుల్లో రాజ్య ప్రభుత్వము అధిసూచించునట్టి తేదీ నుండి ఎవరేని వ్యక్తి, స్థానిక ప్రాధికార సంస్థ లేదా ఏదేని ఏజన్సీ ప్రత్యక్షముగా గాని లేదా పరోక్షముగా గాని హానికరమైన మురుగు కాలువ లేదా మానవ వ్యర్థాల గుంతలను శుభ్రపరచుట కొరకు ఏ వ్యక్తిని నియోగించరాదు లేదా నియుక్తం చేయరాదు.

8. 5వ పరిచ్ఛేదపు లేదా 6వ పరిచ్ఛేదపు నిబంధనలను ఉల్లంఘించు వారెవరైననూ, మొదటి ఉల్లంఘనకు ఒక సంవత్సరం వరకు విస్తరించగల కాలావధికి కారావాసముతోను లేదా యాభై వేల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను లేదా రెండింటితోను, మరియు ఏదేని తదుపరి ఉలంఘనకు రెండు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారావాసముతోను లేదా ఒక లక్ష రూపాయల వరకు ఉండగల జరిమానాతోను లేదా రెండింటితోను శిక్షింపబడదగి ఉందురు. 5వ పరిచ్ఛేదమును లేదా 6వ పరిచ్ఛేదమును ఉల్లంఘించినందుకు శాస్తి.

9. 7వ పరిచ్ఛేదపు నిబంధనలను ఉల్లంఘించు వారెవరైనను, మొదటి ఉల్లంఘనకు రెండు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారావాసముతోను లేదా రెండు లక్షల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను లేదా రెండింటితోను మరియు ఏదేని తదుపరి ఉల్లంఘనకు ఐదు సంవత్సరముల వరకు విస్తరించగల కాలావధికి కారావాసముతోను లేదా ఐదు లక్షల రూపాయల వరకు ఉండగల జరిమానాతోను లేదా రెండింటితోను శిక్షింపబడదగి ఉందురు. 7వ పరిచ్ఛేదమును ఉల్లంఘించినందుకు శాస్తి.

10. ఆరోపిత అపరాధము జరిగిన తేదీ నుండి మూడు మాసముల లోపుగా దానిపై ఈ విషయములో ఎవరేని వ్యక్తిచే ఫిర్యాదు చేయబడిననే తప్ప, ఈ చట్టము క్రింద శిక్షించదగిన ఏదేని అపరాధమును ఏ న్యాయస్థానమైనను విచారణార్హమైన అపరాధముగా తీసుకొన రాదు (సంజ్ఞేయము చేయబడ రాదు). అభియోగపు కాల పరిమితి.

## అధ్యాయము - 4

## పట్టణ మరియు గ్రామీణ ప్రాంతములలో హస్త పారిశుద్ధ్యపని చేయువారిని గుర్తించుట మరియు వారికి పునరావాసం.

11. (1) ఏదేని పురపాలిక, తన అధికారిత పరిధి లోపల కొంత మంది వ్యక్తులు హస్త పారిశుద్ధ్యం చేయు పనిలో నియోగించబడినారని లేదా నియుక్తం చేయబడినారని నమ్ముటకు తగిన కారణం ఉన్న యెడల, అట్టి పురపాలిక పురపాలికచే పట్టణ ప్రాంతములలోని హస్త పారిశుద్ధ్యపని చేయువారికై సర్వే నిర్వహించబడుట.

ముఖ్య కార్య నిర్వహణాధికారి, అట్టి వ్యక్తులను గుర్తించుటకై సర్వే చేయించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన సర్వే యొక్క విషయము, పద్ధతి క్రమము విహిత పరచబడినట్టి రీతిలో ఉండవలెను మరియు పురపాలక కార్పొరేషన్ల విషయంలో సర్వే ప్రారంభమైన తేదీ నుండి మూడు మాసముల కాలావధి లోపల, ఇతర పురపాలికల విషయంలో ఒక మాసము లోపల పూర్తి చేయవలెను.

(3) సర్వే చేపట్టబడిన వాటిపై అధికారిత పరిధి కలిగివున్న పురపాలిక ముఖ్య కార్య నిర్వహణాధికారి, సర్వేను కచ్చితముగా, సకాలంలో పూర్తి చేయడానికి బాధ్యత వహించవలెను.

(4) సర్వే పూర్తయిన తరువాత ముఖ్య కార్యనిర్వహణాధికారి, తన యొక్క అధికారితా పరిధిలోని పురపాలికలో హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా పనిచేస్తున్నట్లు కనుగొనబడిన వ్యక్తుల తాత్కాలిక జాబితాను తయారు చేయవలెను మరియు విహిత పరచబడినట్టి అర్హతా షరతులను నెరవేర్చవలెను, విహిత పరచబడినట్టి రీతిలో సాధారణ సమాచారం కొరకు అట్టి తాత్కాలిక జాబితాను ప్రచురింపజేయవలెను మరియు జాబితాకు సంబంధించి సాధారణ ప్రజానీకము నుండి ఆక్షేపణలను ఆహ్వానించవలెను.

(5) ఉప-పరిచ్ఛేదము (4) ననుసరించి ప్రచురించబడిన తాత్కాలిక జాబితాలో ఏదేని పేరును చేర్చుటకు లేదా మినహాయించుటకైనటు వంటి ఏదేని ఆక్షేపణలను కలిగివున్న ఎవరేని వ్యక్తి, అట్టి ప్రచురణ తేదీ నుండి పదిహేను దినముల కాలావధి లోపల, పురపాలిక నిర్దిష్టపరచినట్టి ప్రరూపంలో ముఖ్య కార్య నిర్వహణాధికారికి ఆక్షేపణను దాఖలు చేయవలెను.

(6) ఉప-పరిచ్ఛేదము(5) ననుసరించి స్వీకరించిన ఆక్షేపణలన్నింటిని విచారణ చేయవలెను, మరియు అటు తర్వాత, పురపాలిక స్థానిక పరిమితుల లోపల హస్త పారిశుద్ధ్యం చేయువారిగా పనిచేస్తున్నట్లు కనుగొనబడిన వ్యక్తుల తుది జాబితాను, విహిత పరచబడినట్టి రీతిలో ప్రచురింపజేయ వలెను.

(7) ఉప-పరిచ్ఛేదము (6)లో నిర్దేశించబడినటువంటి హస్త పారిశుద్ధ్యపని చేయువారి తుది జాబితాను ప్రచురించిన వెంటనే, 6వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క నిబంధనలకు అధ్యదీనమై, సదరు జాబితాలో చేర్చబడిన వ్యక్తులను హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా పని చేయుటకైన ఏదేని బాధ్యత నుండి విముక్తి చేయబడినట్లుగా భావించవలెను.

పట్టణ హస్త పారిశుద్ధ్య పనివానిగా గుర్తించుట కొరకు దరఖాస్తు.

12. (1) పట్టణ ప్రాంతములో హస్త పారిశుద్ధ్యపని చేయువానిగా పనిచేస్తున్న ఎవరేని వ్యక్తి, 11వ పరిచ్ఛేదము ననుసరించి తాను పనిచేస్తున్నటువంటి అధికారిత పరిధిలోనికి వచ్చు పురపాలికచే చేపట్టబడిన సర్వే సమయములో గాని లేదా అటు తర్వాత ఏ సమయములోనైననూ, విహిత పరచబడినట్టి రీతిలో పురపాలిక ముఖ్య కార్య నిర్వహణాధికారికి లేదా ఈ విషయంలో ఆయనచే అధికారమియబడిన ఎవరేని ఇతర అధికారికి, తనను హస్త పారిశుద్ధ్యం చేయువానిగా గుర్తించుట కొరకు దరఖాస్తు చేసుకొనవచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ధరఖాస్తు స్వీకరించిన మీదట, ముఖ్య కార్య నిర్వహణాధికారి, ధరఖాస్తుదారు హస్త పారిశుద్ధ్యపని చేయువాడా, కాదా అని తెలుసుకొనుటకై 11వ పరిచ్ఛేదము క్రింద చేపట్టిన సర్వేలోని భాగముగా గాని, లేదా అట్టి సర్వే అమలులో లేనపుడు, అట్టి ధరఖాస్తు అందిన పదిహేను దినముల లోపల విచారణ చేయించవలెను.

(3) 11వ పరిచ్ఛేదము క్రింద సర్వే అమలులో లేనపుడు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ధరఖాస్తు స్వీకరించినపుడు, మరియు ఉప-పరిచ్ఛేదము (2) ప్రకారం విచారణ తర్వాత అది వాస్తవమని కనుగొనినపుడు, 11వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (6) క్రింద

ప్రచురించబడిన తుది జాబితాలో పేరును చేర్చుటకై చర్య తీసుకొనవలెను మరియు దానిపై ఉప-పరిచ్ఛేదము (7)లో పేర్కొన్న పరిణామములను అనుసరించవలెను.

పురపాలికచే హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా గుర్తించబడిన వ్యక్తులకు పునరావాసం.

13. (1) 11వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) ననుసరించి ప్రచురించబడిన హస్త పారిశుద్ధ్యం చేయువారి తుది జాబితాలో చేర్చబడిన లేదా 12వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (3)ననుసరించి దానికి చేర్చబడిన ఎవరేని వ్యక్తికి, ఈ క్రింది చెప్పబడిన రీతిలో పునరావాసం కల్పించవలెను, అవేవనగా :-

(ఎ) ఒక మాసము లోపల అతనికి ఈ క్రింది వాటిని ఇవ్వవలెను,

(i) ఇతర విషయములతో పాటుగా, అతనిపై ఆధారపడియున్న అతని కుటుంబ సభ్యులందరి వివరాలు గల ఒక ఫోటో గుర్తింపు కార్డు, మరియు

(ii) విహిత పరచబడినట్టి ఏక కాలిక ప్రారంభ నగదు సహాయం;

(బి) కేంద్ర ప్రభుత్వ లేదా రాజ్య ప్రభుత్వ లేదా సందర్భానుసారముగా స్థానిక ప్రాధికార సంస్థల యొక్క సంబంధిత పథకం ప్రకారం అతని యొక్క పిల్లలు ఉపకార వేతనం పొందుటకు హక్కు కలిగి ఉందురు;

(సి) హస్త పారిశుద్ధ్యం చేయువారికైన, అతని అర్హత, సమ్మతి మరియు కేంద్ర ప్రభుత్వ లేదా రాజ్య ప్రభుత్వ లేదా సంబంధిత స్థానిక ప్రాధికార సంస్థ నిబంధనలకు అధ్యధీనమై, గృహ నిర్మాణమునకు నివాస స్థలమును కేటాయించవలెను లేదా నిర్మించి సిద్ధంగా ఉన్న గృహమును కొనుగోలు చేయుట కొరకు అతనికి ఆర్థిక సహాయమును అందించవలెను;

(డి) అర్హత మరియు సమ్మతికి అధ్యధీనమై, అతనికి లేదా అతని కుటుంబంలోని కనీసం ఒక వయోజన సభ్యునికి జీవనోపాధి నైపుణ్యంలో శిక్షణను ఇవ్వవలెను మరియు అట్టి శిక్షణా కాలంలో అతనికి మూడు వేల రూపాయలకు తక్కువ కానట్టి నెలసరి ఉపకార వేతనము (స్టయి ఫండ్) ఇవ్వవలెను.

(ఇ) అర్హత మరియు సమ్మతికి అధ్యధీనమై, అతనికి లేదా అతని కుటుంబములో కనీసం ఒక వయోజన సభ్యునికి, కేంద్ర ప్రభుత్వము, రాజ్య ప్రభుత్వము లేదా సంబంధిత స్థానిక ప్రాధికార సంస్థ యొక్క సంబంధిత పథకంలో నిర్దిష్టపరచబడినట్టి రీతిలో తగిన ఆధారముపై ప్రత్యమ్నాయ వృత్తిని చేపట్టుట కొరకు సబ్సిడీ మరియు రాయితీ రుణమును ఇవ్వవలెను;

(ఎఫ్) కేంద్ర ప్రభుత్వము లేదా రాజ్య ప్రభుత్వముచే ఈ విషయంలో అధిసూచించబడునట్టి ఇతర న్యాయ మరియు కార్యవంతమైన సహాయమును అతనికి ఏర్పరచవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనల ప్రకారం హస్త పారిశుద్ధ్యం చేయు ప్రతి ఒకరికి పునరావాసం కల్పించుటకు సంబంధిత జిల్లా మేజిస్ట్రేటు బాధ్యత వహించవలెను మరియు దీనికి అదనంగా రాజ్య ప్రభుత్వము లేదా సంబంధిత జిల్లా మేజిస్ట్రేటు తన బాధ్యతలను క్రింది అధికారులకు మరియు సంబంధిత పురపాలక అధికారులకు అప్పగించ వచ్చును. .

పంచాయతీలచే గ్రామీణ ప్రాంతాలలోని హస్త పారిశుద్ధ్యపని చేయువారికై సర్వే చేయుట.

14. ఏదేని పంచాయతీ, తన అధికారిత పరిధి లోపల కొంత మంది వ్యక్తులు హస్త పారిశుద్ధ్యపని చేయు పనిలో నియోగించబడినారని నమ్ముటకు తగిన కారణం ఉన్న యెడల, అట్టి పంచాయతీ యొక్క కార్య నిర్వహణాధికారి, ఇతర విషయములతో పాటుగా 11 మరియు 12వ పరిచ్ఛేదముల యొక్క నిబంధనల ననుసరించి అట్టి హస్త పారిశుద్ధ్యపని చేయువారిని గుర్తించుటకు సర్వేను చేయించవలెను.

గ్రామీణ హస్త పారిశుద్ధ్యపని చేయువానిగా గుర్తించబడుట కొరకు దరఖాస్తు.

15. (1) గ్రామీణ ప్రాంతములో హస్త పారిశుద్ధ్యం చేయువానిగా పని చేస్తున్న ఎవరేని వ్యక్తి, 14వ పరిచ్ఛేదము ననుసరించి, తాను పనిచేస్తున్నటు వంటి అధికారిత పరిధిలోనికి వచ్చు పంచాయితీచే చేపట్టబడిన సర్వే సమయములో గాని లేదా ఆ తర్వాత ఏ సమయములోనైనను విహితపరచబడినట్టి రీతిలో పంచాయతీ యొక్క ముఖ్య కార్య నిర్వహణాధికారికి లేదా ఈ విషయములో ఆయనచే అధికారమీయబడిన ఎవరేని ఇతర అధికారికి, తనను హస్త పారిశుద్ధ్యపని చేయువానిగా గుర్తించుట కొరకు దరఖాస్తు చేసుకొనవచ్చును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ధరఖాస్తు స్వీకరించిన మీదట, ముఖ్య కార్య నిర్వహణాధికారి, ధరఖాస్తుదారు హస్త పారిశుద్ధ్యపని చేయువాడా, కాదా అని తెలుసుకొనుటకై, 14వ పరిచ్ఛేదము క్రింద చేపట్టిన సర్వేలో భాగముగా గాని లేదా అట్టి సర్వే అమలులో లేనపుడు, అట్టి దరఖాస్తు అందిన పదిహేను దినముల లోపల విచారణ చేయించవలెను.

పంచాయతీచే హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా గుర్తించబడిన వ్యక్తుల పునరావాసం.

16. 14వ పరిచ్ఛేదము ననుసరించి ప్రచురించబడిన లేదా 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) ననుసరించి హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా తుది జాబితాలో చేర్చబడిన ఎవరేని వ్యక్తికి, ఇతర విషయములతో పాటుగా 13వ పరిచ్ఛేదములోని పట్టణంలో హస్త పారిశుద్ధ్యపని చేయువారి కొరకు పొందు పరచిన రీతిలో పునరావాసం కల్పించవలెను.

## అధ్యాయము - 5
## అమలుచేయు ప్రాధికార సంస్థలు

అనారోగ్యకరమైన మరుగుదొడ్లను తొలగించునట్లు చూడడం స్థానిక ప్రాధికార సంస్థల బాధ్యత.

17. తత్సమయమున అమలులో ఉన్న ఏదేని ఇతర శాసనములో ఏమి ఉన్నప్పటికిని, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి తొమ్మిది మాసముల కాలావధి ముగిసిన తరువాత, అవగాహనా ఉద్యమము ద్వారా లేదా అట్టి ఇతర రీతిలో, ప్రతీ స్థానిక ప్రాధికార సంస్థ ఈ క్రింది వాటికి బాధ్యత వహించ వలెను,-

(i) తన యొక్క అధికారిత పరిధిలో ఎటువంటి అనారోగ్యకరమైన మరుగు దొడ్డిని నిర్మించరాదు, నిర్వహించరాదు లేదా ఉపయోగించరాదు; మరియు

(ii) ఖండము (జీ)ని ఉల్లంఘించిన సందర్భములో 5వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేధము (3) క్రింద స్వాధీన దారునిపై చర్య తీసుకొనుట.

18. సముచిత ప్రభుత్వము, ఈ చట్టము యొక్క నిబంధనలను తగు విధముగా నిర్వర్తించబడునట్లు చూడడానికి అవసరమైన అధికారములను స్థానిక ప్రాధికార సంస్థ మరియు జిల్లా మేజిస్ట్రేటుకు ఒసగవచ్చును మరియు వారిపై అట్టి కర్తవ్యములను విధించ వచ్చును. స్థానిక ప్రాధికార సంస్థ మరియు జిల్లా మేజిస్ట్రేటు, అట్లు ఒసగబడిన అధికారములన్నింటిని, విధించబడిన కర్తవ్యములన్నింటిని లేక వాటిలో ఏవేని కొన్నింటిని, అధీనస్థ అధికారులను నిర్దిష్ట పరచ వచ్చును మరియు అట్లు నిర్దిష్టపరచబడిన అధికారి లేదా అధికారులు స్థానిక హద్దుల లోపల అట్టి అధికారములు లేదా కర్తవ్యములను నెరవేర్చవలెను.

ఈ చట్టపు నిబంధనలను అమలు చేయుట కొరకు నిర్దిష్టపరచబడు ప్రాధికార సంస్థలు.

19. జిల్లా మేజిస్ట్రేటు మరియు 18వ పరిచ్ఛేదము క్రింద ప్రాధికారమీయ బడిన ప్రాధికారి లేదా ఆ పరిచ్ఛేదము క్రింద వారిచే నిర్దిష్ట పరచబడిన ఎవరేని ఇతర అధీనస్థ అధికారులు, ఈ చట్టపు ప్రయోజనం కొరకు నిర్దిష్టపరచినట్టి కాలావధి ముగిసిన తరువాత, ఈ క్రింద పేర్కొన్నవి జరుగునట్లు చూడ వలెను,-

జిల్లా మేజిస్ట్రేటు మరియు ప్రాధికృత అధికారుల కర్తవ్యం.

(ఎ) వారి యొక్క అధికారితా పరిధి లోపల ఏ వ్యక్తిని హస్త పారిశుద్ధ్యం చేయువానిగా నియుక్తం చేయడంగాని, నియోగించడం గాని చేయరాదు;

(బి) ఏ వ్యక్తి అయిననూ అనారోగ్యకరమైన మరుగు దొడ్డిని నిర్మించుట, నిర్వహించుట, ఉపయోగించుట లేదా, ఉపయోగిం చుటకు అందుబాటులో ఉంచుటను చేయరాదు;

(సి) ఈ చట్టము క్రింద గుర్తించబడిన హస్త పారిశుధ్యపని చేయు వారికి 13వ పరిచ్ఛేదము లేదా సందర్భానుసారంగా 16వ పరిచ్ఛేదము ప్రకారం పునరావాసం కల్పించుట;

(డి) 5వ పరిచ్ఛేదపు లేదా 6వ పరిచ్ఛేదపు లేదా 7వ పరిచ్ఛేదపు నిబంధనలను ఉల్లంఘించిన వ్యక్తులను ఈ చట్టపు నిబంధనల క్రింద దర్యాప్తు చేసి అభియోగం జరపవలెను; మరియు

(ఇ) అతని యొక్క అధికారిత పరిధి లోపల వర్తించదగు ఈ చట్టపు నిబంధనలన్నింటిని విధిగా పాటించునట్లు చూడవలెను.

తనిఖీ దారుల నియామకము మరియు వారి యొక్క అధికారములు.

20. (1)ఈ చట్టపు ప్రయోజనముల కొరకు సముచిత ప్రభుత్వము, అధిసూచన ద్వారా, నియమించుటకు తగిన వారని భావించునంత మంది వ్యక్తులను నియమించవచ్చును మరియు ఈ చట్టము క్రింద వారి యొక్క అధికారములను వినియోగించు స్థానిక పరిమితులను నిర్ధారించవలెను.

(2) తనిఖీదారు, ఈ విషయములో చేయబడిన ఏవేని నియమములకు అధ్యధీనమై ఈ క్రింది విషయములకు సంబంధించి అతని యొక్క అధికారిత పరిధిలోని స్థానిక పరిమితుల లోపల, అన్ని సబబైన సమయములలోను, తాను అవసరమని భావించునట్టి సహాయముతో, ఏవేని ఆవరణలు లేదా స్థలములోకి ప్రవేశించ వచ్చును,-

(ఎ) ఈ చట్టము క్రింద అపరాధము జరిగినదని లేదా జరుగుచున్నదని లేదా జరుగబోవునని తాను నమ్ముటకు కారణం ఉన్న యెడల, మరియు హస్త పారిశుధ్యపని చేయువానిగా నియోగించడం నుండి నివారించుటకై ఏదేని మురుగుదొడ్డి, తెరచి ఉంచిన మురుగు కాలువ లేదా గొయ్యిని పరిశీలించుట మరియు పరీక్షించుటకు ఏవేని ఆవరణలు లేదా స్థలము యొక్క తనిఖీని నిర్వహించవలెను;

(బి) అట్టి ఆవరణలో తాను కనుగొన్న మరియు అతను అక్కడ హస్త పారిశుద్ధ్యం చేయువానిగా నియోగించబడినాడని తాను విశ్వసించుటకు సబబైన కారణమున్నట్టి లేదా ఈ చట్టపు నిబంధనలు మరియు దాని క్రింద చేసిన నియమములను పాటించుట లేక పాటించకపోవుట గురించి ఇతర విధముగా సమాచారమును సమర్పించవలసిందిగా కోరుటకై ఏ వ్యక్తినైనను పరిశీలించవచ్చును;

(సి) అట్టి ఆవరణలలో తాను కనుగొన్న ఎవరేని వ్యక్తిని, అట్టి ఆవరణలలో హస్త పారిశుద్ధ్యపని చేయువారిగా నియోగించబడిన వ్యక్తుల మరియు వారిని నియుక్తం చేసిన వ్యక్తులు, ఏజెన్సీ లేదా కాంట్రాక్టరు పేర్లు మరియు చిరునామాల విషయంలో అతని యొక్క అధికారములో సమాచారం ఇవ్వవలసిందిగా కోరవలెను;

(డి) ప్రధాన యజమాని లేదా ఏజెన్సీ అపరాధము చేసినారని తనకు విశ్వసించుటకు కారణమున్నచో ఈ చట్టము క్రింద సదరు అపరాధమునకు సంబంధించినట్టి రిజిస్టర్లు, వేతనముల రికార్డు లేదా వాటి యొక్క నోటీసులు లేదా భాగములను స్వాధీనము చేసుకొనవలెను లేదా వాటి ప్రతులను తీసుకొనవలెను; మరియు

(ఇ) విహితపరచబడునట్టి ఇతర అధికారములను వినియోగించ వలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ఏదేని దస్తావేజు లేదా వస్తువును సమర్పించవలసిన లేదా తనిఖీదారుచే కోరబడిన ఏదేని సమాచారమును ఇవ్వవలసిన ఎవరేని వ్యక్తి, భారత శిక్షాస్మృతి, 1860లోని 175వ పరిచ్ఛేదము 1860లోని 45వది. మరియు 176వ పరిచ్ఛేదము యొక్క అర్థము లోపల అట్లు చేయుటకు శాసన బద్ధుడైనట్లుగా భావించవలెను.

1974లోని 2వది.

(4) క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 యొక్క నిబంధనలు, సదరు స్మృతి యొక్క 94వ పరిచ్ఛేదము క్రింద జారీ చేయబడిన వారంటు ప్రాధికారము క్రింద చేయబడినట్టి సోదా లేదా అభిగ్రహణమునకు వర్తించునట్టి నిబంధనలను, ఉప-పరిచ్ఛేదము (2) క్రింది ఏదేని అట్టి సోదా లేదా అభిగ్రహణకు సాధ్యమైనంత వరకు వర్తింపజేయవలెను.

## అధ్యాయము -6
## విచారణ ప్రక్రియ

అపరాధములను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు విచారించుట.

1974లోని 2వది.

21. (1) రాజ్య ప్రభుత్వము, ఈ చట్టము క్రింద అపరాధములను విచారణ చేయుటకై మొదటి తరగతి న్యాయిక మెజిస్ట్రేటు యొక్క అధికారములను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటుకు ప్రదత్తము చేయవచ్చును; మరియు, అట్లు అధికారములను ప్రదత్తము చేసిన మీదట, అట్లు అధికారములు ప్రదత్తము చేయబడిన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు, క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973 యొక్క ప్రయోజనముల కొరకు మొదటి తరగతి న్యాయిక మేజిస్ట్రేటుగా భావించబడ వలెను.

(2) ఈ చట్టము క్రింద అపరాధమును సంక్షిప్తంగా విచారించవచ్చును.

విచారణార్హమైన (సంజ్ఞేయమైన) మరియు జామీను ఇవ్వదగని అపరాధము.
1974లోని 2వది.

22. క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973లో ఏమున్నప్పటికినీ, ఈ చట్టము క్రింది ప్రతి అపరాధము విచారణార్హమైనదిగాను (సంజ్ఞేయమైనదిగానే) మరియు జామీను ఇవ్వదగనిదిగాను ఉండును.

కంపెనీలచే అపరాధములు.

23. (1) ఈ చట్టము క్రింద అపరాధమును ఒక కంపెనీ చేసినపుడు, ఆ అపరాధము జరిగిన సమయంలో కంపెనీ యొక్క వ్యాపార నిర్వహణకు ఇన్-ఛార్జిగా ఉన్న మరియు అందుకు బాధ్యత వహించిన ప్రతి వ్యక్తియును మరియు అదేవిధంగా కంపెనీయు ఆ అపరాధము చేసినట్లు భావించవలెను మరియు తదనుసారముగా చర్యలకును, శిక్షకును పాత్రులు అగుదురు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, ఈ చట్టము క్రింద అపరాధము ఒక కంపెనీ చేసి ఉండి, ఆ అపరాధమును ఆ కంపెనీ యొక్క ఎవరేని డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేదా ఇతర అధికారి యొక్క సమ్మతితో లేదా మౌనానుకూలతతో జరిగినదని రుజువైన యెడల లేదా వారి నిర్లక్ష్యం వలన ఆ అపరాధము జరిగినదని ఆపాదించదగిన యెడల అట్టి డైరెక్టరు, మేనేజరు, కార్యదర్శి లేక ఇతర అధికారి ఆ అపరాధమును చేసినట్లు భావించవలెను మరియు తదనుసారముగా చర్యలకును శిక్షకును పాత్రులు అగుదురు.

విశదీకరణ:– ఈ పరిచ్ఛేదపు ప్రయోజనము నిమిత్తము,–

(ఎ) "కంపెనీ" అనగా ఏదేని నిగమ నికాయము అని అర్థము. ఈ పదపరిధి యందు ఫర్మ్, లేక వ్యక్తుల యొక్క ఇతర అసోసియేషను చేరి యుండును; మరియు

(బి) ఒక ఫర్మ్‌కు, సంబంధించినంత వరకు "డైరెక్టరు" అనగా ఫర్మ్‌లోని భాగస్వామి అని అర్థము.

## అధ్యాయము –7
## నిఘాకమిటీలు.

24. (1) ప్రతిరాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా, ప్రతి జిల్లాకు మరియు ప్రతి సబ్-డివిజనుకు ఒక నిఘాకమిటీని ఏర్పాటు చేయవలెను. నిఘా కమిటీలు.

(2) జిల్లా కొరకు ఏర్పాటు చేయబడిన ప్రతి నిఘా కమిటీ ఈ క్రింది సభ్యులతో కూడి ఉండవలెను, వారెవరనగా:-

(ఎ) జిల్లా మెజిస్ట్రేటు – పదవిరీత్యా ఛైర్‌పర్సను;

(బి) జిల్లా నుండి ఎన్నుకొనబడిన అనుసూచిత కులములకు చెందిన రాజ్య శాసన మండలి యొక్క సభ్యులందరు – సభ్యులు:

అయితే, రాజ్యశాసన మండలిలో ఒక జిల్లాకు అనుసూచిత కులములకు చెందిన సభ్యుడు లేని యెడల, రాజ్య ప్రభుత్వము, జిల్లా నుండి ఇద్దరికి మించనట్టి సంఖ్యలో తాను సముచితమని భావించునట్టి రాజ్య శాసన మండలి యొక్క ఇతర సభ్యులను నామనిర్దేశము చేయవచ్చును.

(సి) జిల్లా పోలీసు సూపరిండెంటు – పదవి రీత్యా సభ్యుడు.

(డి) ఈ క్రింది వాటి యొక్క కార్య నిర్వహణాధికారి.–

(i) జిల్లా స్థాయిలో పంచాయతీ – పదవి రీత్యా సభ్యుడు;

(ii) జిల్లా కేంద్రం యొక్క పురపాలిక – పదవి రీత్యా సభ్యుడు.

(iii) జిల్లాలో ఏర్పాటు చేయబడిన ఏదేని ఇతర పురపాలక కార్పొరేషను – పదవి రీత్యా సభ్యుడు;

(iv) జిల్లాలో కంటొన్మెంటు బోర్డు ఏదేని ఉన్నట్లయితే – పదవీ రీత్యా సభ్యుడు;

(ఇ) జిల్లాలో ఉన్న రైల్వే సంస్థచే నామనిర్దేశం చేయబడిన ఒక ప్రతినిధి;

(ఎఫ్) హస్త పారిశుద్ధ్యం చేయు పనిని నిషేధించుటకు మరియు హస్త పారిశుద్ధ్యపని చేయువారికి పునరావాసం కల్పించుటకై పనిచేస్తున్న వ్యవస్థకు లేదా జిల్లాలో హస్త పారిశుద్ధ్యపని చేయువారి సమాజమునకు ప్రాతినిధ్యం వహించుటకు చెందిన మరియు జిల్లాలో నివశిస్తున్న నలుగురికి మించనట్టి సంఘ సేవకులు, వీరిని జిల్లా మేజిస్ట్రేటు నామనిర్దేశము చేయవలెను మరియు వారిలో ఇద్దరు మహిళలు అయి ఉండవలెను;

(జి) జిల్లాలోని ఆర్థిక మరియు పరపతి సంస్థలకు ప్రాతినిధ్యం వహించుటకైన వ్యక్తి ఒకరు, ఇతనిని జిల్లా మేజిస్ట్రేటు నామనిర్దేశము చేయవలెను;

(హెచ్) అనుసూచిత కులముల సంక్షేమమునకు ఇన్-ఛార్జిగా ఉన్న జిల్లా స్థాయి అధికారి – పదవి రీత్యా సభ్య కార్యదర్శి;

(ఐ) రాజ్య ప్రభుత్వము యొక్క ఏవేని సాధారణ ఉత్తర్వులకు అధ్యదీనమై, ఈ చట్టమును అమలు చేయుటలో ముఖ్య పాత్ర కలిగి ఉన్న జిల్లా మెజిస్ట్రేటు శాఖల యొక్క జిల్లా స్థాయి అధికారులు మరియు ఏజెన్సీలు.

(3) సబ్-డివిజను కొరకు, ఏర్పాటు చేయబడిన ప్రతి నిఘాకమిటీ ఈ క్రింది సభ్యులతో కూడి ఉండవలెను, వారెవరనగా:-

(ఎ) సబ్-డివిజనల్ మెజిస్ట్రేటు – పదవిరీత్యా ఛైర్‌పర్సన్;

(బి) సబ్-డివిజనులోని మధ్యస్థ స్థాయిలో గల పంచాయతీల ఛైర్ పర్సన్లు, ముఖ్య కార్యనిర్వహణాధికారులు, మరియు మధ్యస్థ స్థాయిలో పంచాయతీలు లేనప్పుడు, గ్రామస్థాయిలోని రెండు పంచాయతీల నుండి ఛైర్‌పర్సన్లు, వీరు సబ్ డివిజన్ మేజిస్ట్రేటుచే నామనిర్దేశము చేయబడవలెను – పదవి రీత్యా సభ్యుడు;

(సి) సబ్-డివిజనలు పోలీసు అధికారి – పదవి రీత్యా సభ్యుడు;

(డి) ఈ క్రింది వాటి యొక్క ముఖ్య కార్యానిర్వహణాధికారి,-

(i) సబ్-డివిజనల్ కేంద్రం యొక్క పురపాలిక – పదవి రీత్యా సభ్యుడు; మరియు

(ii) సబ్-డివిజనులో ఉన్న ఏదేని కంటోన్మెంటు బోర్డు-పదవి రీత్యా సభ్యుడు;

(ఇ) సబ్-డివిజనులో ఉన్న రైల్వే ప్రాధికార సంస్థచే నామనిర్దేశము చేయబడు ప్రతినిధి ఒకరు – పదవి రీత్యా, సభ్యుడు;

(ఎఫ్) హస్త పారిశుద్ధ్యం చేయు పనిని నిషేధించుటకు మరియు హస్త పారిశుద్ధ్యపని చేయువారికి పునరావాసం కల్పించుటకై పని చేస్తున్న వ్యవస్థ లేదా సబ్-డివిజన్‌లో హస్తముతో పారిశుద్ధ్యపని చేయువారి సమాజమునకు ప్రాతినిత్యం వహించుటకు చెందిన మరియు సబ్-డివిజన్‌లో నివశిస్తున్న ఇద్దరు సంఘ సేవకులు, వీరిని జిల్లా మేజిస్ట్రేటు నామనిర్దేశము చేయవలెను, వీరిలో ఒకరు మహిళ అయి ఉండవలెను;

(జి) సబ్-డివిజనులోని ఆర్థిక మరియు పరపతి సంస్థలకు ప్రాతినిధ్యం వహించుటకైన వ్యక్తి ఒకరు, ఇతనిని సబ్-డివిజనల్ మేజిస్ట్రేటు, నామనిర్దేశం చేయవలెను;

(హెచ్) అనుసూచిత కులముల సంక్షేమమునకు ఇన్-ఛార్జిగా ఉన్న సబ్-డివిజనల్ స్థాయి అధికారి – పదవి రీత్యా సభ్య-కార్యదర్శి;

(ఐ) రాజ్య ప్రభుత్వము లేదా జిల్లా మేజిస్ట్రేటు యొక్క ఏవేని సాధారణ ఉత్తర్వులకు అధ్యధీనమై, సబ్-డివిజనలు మేజిస్ట్రేటు అభిప్రాయములో ఈ చట్టమును అమలు చేయుటలో ముఖ్య పాత్ర కలిగి వున్న శాఖ యొక్క సబ్-డివిజన్లు స్థాయి అధికారులు మరియు ఏజెన్సీలు – పదవి రీత్యా సభ్యుడు.

(4) జిల్లా మరియు సబ్-డివిజన్లు స్థాయిలో ఏర్పాటు చేయబడిన ప్రతి నిఘా కమిటి కనీసం ప్రతి మూడు మాసములకు ఒక పర్యాయం సమావేశం కావలెను.

(5) నిఘా కమిటీల యొక్క ఏ ప్రొసీడింగు, కేవలం దాని యొక్క ఏర్పాటులోని ఏదేని లోపం కారణం వలన మాత్రమే శాసన మాన్యతను కోల్పోదు.

25. నిఘా కమిటీ యొక్క కృత్యములు ఈ క్రింది విధముగా ఉండవలెను– నిఘాకమిటీ యొక్క కృత్యములు.

(ఎ) ఈ చట్టము యొక్క నిబంధనలు లేదా దాని క్రింద చేయబడిన ఏదేని నియమమును తగు విధముగా అమలు చేయునట్లు చూచుటకు తీసుకొనుటకైన చర్యపై, జిల్లా మేజిస్ట్రేటు లేదా సందర్భానుసారంగా సబ్–డివిజన్లు మెజిస్ట్రేటుకు సలహా నిచ్చుట;

(బి) హస్త పారిశుద్ధ్యపని చేయువారికి ఆర్థిక మరియు సామాజిక పునరావాసమును పర్యవేక్షించుట;

(సి) హస్త పారిశుద్ధ్యపని చేయువారి పునరావాసం నిమిత్తం సరిపడినంత పరపతి మార్గాన్ని సులభము చేయు ఉద్దేశంతో, సంబంధిత ఏజెన్సీలన్నింటి కృత్యములను సమన్వయ పరచుట;

(డి) ఈ చట్టము క్రింద అపరాధముల రిజిస్ట్రీకరణను మరియు వాటి యొక్క దర్యాప్తును మరియు అభియోగమును పర్యవేక్షించుట.

26. (1) ప్రతి రాజ్య ప్రభుత్వము అధిసూచన ద్వారా ఈ క్రింది సభ్యులతో కూడిన ఒక రాజ్య పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయవలెను:– రాజ్య పర్యవేక్షణ కమిటీ.

(ఎ) రాజ్య ముఖ్యమంత్రి లేదా ఆయనచే నామనిర్దేశము చేయబడిన ఒక మంత్రి – పదవి రీత్యా ఛైర్‌పర్సను;

(బి) అనుసూచిత కులాల సంక్షేమము మరియు రాజ్య ప్రభుత్వం అధిసూచించినట్టి ఇతర శాఖ ఇన్‌ఛార్జి మంత్రి;

(సి) రాజ్య సఫాయి కర్మచారీల మరియు అనుసూచిత కులము కమీషన్ల ఛైర్ పర్సన్, ఎవరేని ఉన్న యెడల – పదవి రీత్యా సభ్యుడు;

(డి) జాతీయ అనుసూచిత కులాలు మరియు సఫాయి కర్మచారీల ప్రతినిధులు – పదవి రీత్యా సభ్యుడు;

(ఇ) రాజ్య ప్రభుత్వముచే నామనిర్దేశము చేయబడిన, రాజ్య శాసన మండలిలో అనుసూచిత కులములకు చెందిన ఇద్దరికి తక్కువ కానట్టి సభ్యులు:

అయితే, ఏదేని రాజ్య శాసన మండలిలో అనుసూచిత కులములకు చెందిన సభ్యుడు లేని యెడల, రాజ్య ప్రభుత్వం, అనుసూచిత జనజాతులకు చెందిన సభ్యులను నామనిర్దేశం చేయవచ్చును;

(ఎఫ్) పోలీసు డైరెక్టరు జనరలు – పదవి రీత్యా సభ్యుడు;

(జి) రాజ్య ప్రభుత్వము అధిసూచించునట్టి, రాజ్య ప్రభుత్వపు శాఖలైన ఆంతరంగిక, పంచాయతీ రాజ్, పట్టణ స్థానిక నికాయములు మరియు అట్టి ఇతర శాఖల కార్యదర్శులు;

(హెచ్) రాజ్య ప్రభుత్వం అధిసూచించినట్టి, కనీసం ఒక పురపాలక కార్పొరేషను, జిల్లా స్థాయిలో పంచాయతీ, కంటోన్మెంటు బోర్డు మరియు రైల్వే ప్రాధికార సంస్థ యొక్క ముఖ్య కార్య నిర్వహణాధికారి;

(ఐ) హస్త పారిశుద్ధ్యపని చేయు పనిని నిషేధించుటకు మరియు హస్త పారిశుద్ధ్యపని చేయువారికి పునరావాసం కల్పించుటకై పని చేస్తున్న వ్యవస్థకు లేదా రాజ్యంలో పారిశుద్ధ్యపని చేయువారి సమాజమునకు ప్రాతినిధ్యం వహించుటకు చెందిన మరియు రాజ్యములో నివశిస్తున్న, నలుగురికి మించని సంఘ సేవకులు, వీరిని రాజ్య ప్రభుత్వము నామనిర్దేశము చేయవలెను వారిలో ఇద్దరు మహిళలై ఉండవలెను;

(జె) రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనరు బ్యాంకు యొక్క రాష్ట్రస్థాయి అధిపతి – పదవి రీత్యా సభ్యుడు;

(కె) అనుసూచిత కులముల అభివృద్ధితో వ్యవహరిస్తున్న రాజ్య ప్రభుత్వపు శాఖ యొక్క కార్యదర్శి – పదవి రీత్యా సభ్య – కార్యదర్శి;

(ఎల్) రాజ్య ప్రభుత్వ అభిప్రాయములో, ఈ చట్టమును అమలు చేయుటకు సంబంధించిన రాజ్య ప్రభుత్వపు శాఖల యొక్క అట్టి ఇతర ప్రతినిధి మరియు అట్టి ఇతర ఏజెన్సీలు.

(2) రాజ్య పర్యవేక్షక కమిటీ, కనీసము ప్రతి ఆరుమాసములకు ఒక సారి సమావేశమై తన యొక్క సమావేశములలో విహితపరచునట్టి కార్యకలాప నిర్వహణకు సంబంధించినట్టి ప్రక్రియ నియమావళిని గమనించవలెను.

27. రాజ్య పర్యవేక్షక కమిటీ యొక్క కృత్యములు ఈ క్రింది విధముగా ఉండవలెను,– రాజ్య పర్యవేక్షక కమిటీ యొక్క కృత్యములు.

(ఎ) ఈ చట్టమును సమర్థవంతంగా అమలు చేయుట కొరకు పర్యవేక్షించుట మరియు రాజ్య ప్రభుత్వమునకు మరియు స్థానిక ప్రాధికార సంస్థలకు సలహానిచ్చుట;

(బి) సంబంధిత ఏజెన్సీలన్నింటి యొక్క కృత్యములను సమన్వయ పరచుట;

(సి) ఈ చట్టమును అమలు చేయుటకు సంబంధించిన లేక అనుషంగికమైన ఏదేని ఇతర విషయములను చూచుట.

28. ఈ చట్టము యొక్క అమలు పురోగతి గురించి, కేంద్ర ప్రభుత్వముచే కోరబడునటువంటి నియతకాలిక నివేదికలను ప్రతి రాజ్యము లేదా ప్రభుత్వ సంఘ రాజ్య క్షేత్రము మరియు సంఘ రాజ్య క్షేత్ర పరిపాలన, కేంద్ర ప్రభుత్వమునకు పంపవలెను. కేంద్ర ప్రభుత్వమునకు నియతకాలిక నివేదికలను పంపుట, రాజ్యములు లేదా సంఘ రాజ్య క్షేత్రముల కర్తవ్యము.

కేంద్ర పర్యవేక్షక కమిటీ.

29. (1) ఈ పరిచ్ఛేదపు నిబంధనలననుసరించి కేంద్ర ప్రభుత్వము అధిసూచన ద్వారా కేంద్ర పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేయవలెను.

(2) కేంద్ర పర్యవేక్షక కమిటీ ఈ క్రింది సభ్యులతో కూడి ఉండవలెను, వారెవరనగా:-

(ఎ) సామాజిక న్యాయము మరియు సాధికారిత శాఖ కేంద్ర మంత్రి - పదవి రీత్యా ఛైర్ పర్సను;

(బి) అనుసూచిత కులముల జాతీయ కమీషను ఛైర్ పర్సను - పదవి రీత్యా సభ్యుడు;

(సి) సామాజిక న్యాయము లేదా సాధికారిత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి - పదవి రీత్యా సభ్యుడు;

(డి) సఫాయి కర్మచారీల జాతీయ కమీషను ఛైర్ పర్సను,-

(ఇ) అనుసూచిత కులముల అభివృద్ధితో వ్యవహరించు ప్రణాళిక కమీషను సభ్యుడు - పదవి రీత్యా సభ్యుడు;

(ఎఫ్) అనుసూచిత కులములకు చెందిన ఎన్నికైన ముగ్గురు పార్లమెంటు సభ్యులు, లోక్ సభ నుండి ఇద్దరు మరియు రాజ్యసభ నుండి ఒకరు;

(జి) ఈ క్రింది మంత్రిత్వ శాఖల కార్యదర్శులు;

(i) సామాజిక న్యాయం మరియు సాధికారిత, సామాజిక న్యాయం మరియు సాధికారిత శాఖ;

(ii) పట్టణాభివృద్ధి;

(iii) గృహ నిర్మాణ మరియు పట్టణ దారిద్ర్య నిర్మూలన;

(iv) తాగునీరు మరియు పారిశుద్ధ్యము;

(v) పంచాయతీ రాజ్;

(vi) విత్తీయ, విత్తీయ సేవల శాఖ; మరియు

(vii) రక్షణ, పదవి రీత్యా సభ్యులు.

(హెచ్) ఛైర్మన్, రైల్వే బోర్డు – పదవి రీత్యా సభ్యుడు;

(ఐ) డైరెక్టరు జనరల్, రక్షణ ఎస్టేట్లు – పదవి రీత్యా సభ్యుడు;

(జె) కేంద్ర ప్రభుత్వము అధిసూచించునట్లుగా ఆరుగురికి తక్కువ కానట్టి రాజ్య ప్రభుత్వము మరియు ఒక సంఘ రాజ్య క్షేత్రపు ప్రతినిధులు;

(కె) హస్త పారిశుద్ధ్యపని చేయువారికి పునరావాసము కల్పించుటకై పనిచేస్తున్న వ్యవస్థకును లేదా దేశంలో హస్త పారిశుద్ధ్యపని చేయువారి సమాజమునకు ప్రాతినిధ్యం వహించుటకును చెందిన మరియు దేశంలో నివశిస్తున్న ఆరుగురికి మించినట్టి సంఘసేవకులు, వీరిని ఛైర్ పర్సన్ నామనిర్దేశము చేయవలెను, వారిలో ఇద్దరు మహిళలై ఉండవలెను;

(ఎల్) అనుసూచిత కులాల అభివృద్ధిని పర్యవేక్షిస్తున్న సామాజిక న్యాయము మరియు సాధికారిత మంత్రిత్వ శాఖలోని సామాజిక న్యాయము మరియు సాధికారత శాఖ సంయుక్త కార్యదర్శి – పదవి రీత్యా సభ్యకార్యదర్శి;

(ఎమ్) చైర్ పర్సన్ అభిప్రాయములో ఈ చట్టమును అమలు చేయునట్టి సంబంధిత కేంద్ర మంత్రిత్వములు లేదా శాఖల యొక్క ఇతర ప్రతినిధులు మరియు ఏజెన్సీలు.

(3) కేంద్ర పర్యవేక్షక కమిటీ, కనీసము ప్రతి ఆరుమాసములకు ఒక పర్యాయం సమావేశము కావలెను.

కేంద్ర పర్యవేక్షక కమిటీ కృత్యములు.

30. కేంద్ర పర్యవేక్షక కమిటీ కృత్యములు ఈ క్రింది విధముగా ఉండవలెను,-

(ఎ) ఈ చట్టమును మరియు సంబంధిత శాసనములను మరియు కార్యక్రమములను కట్టుదిట్టముగ అమలు చేయుటను పర్యవేక్షించుటకై కేంద్ర, రాజ్య ప్రభుత్వములకు సలహానిచ్చుట;

(బి) సంబంధిత ఏజెన్సీలన్నింటి కృత్యములను సమన్వయ పరచుట;

(సి) ఈ చట్టమును అమలు పరచుటను సంబంధించిన లేక ఆనుషంగికమైన ఏవేని ఇతర విషయములను చూచుట.

సఫాయి కర్మ చారీల జాతీయ కమీషను కృత్యములు.

31. (1) సఫాయి కర్మచారీల జాతీయ కమీషను ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అనేవనగా:-

(ఎ) ఈ చట్టమును అమలు పరచుటకు పర్యవేక్షించుట;

(బి) ఈ చట్టపు నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులను విచారణ చేయుట మరియు తదుపరి చర్యకు అవసరమగు సిఫారసులతో సంబంధిత ప్రాధికార సంస్థలకు తన యొక్క పరిష్కారములను తెలియజేయుట;

(సి) ఈ చట్టపు నిబంధనలను కట్టుదిట్టముగ అమలు పరచుటకై కేంద్ర, రాజ్య ప్రభుత్వములకు సలహా నిచ్చుట; మరియు

(డి) ఈ చట్టమును అమలు పరచకపోవుటకు సంబంధించిన విషయముపై నోటీసును తనంతటతానుగా విచారణకు స్వీకరించుట.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జాతీయ కమీషను తన కృత్యములను నిర్వర్తించుటలో, ఆ ఉప-పరిచ్ఛేదములో నిర్దిష్టపరిచిన ఏదేని విషయమునకు సంబంధించి ఏదేని ప్రభుత్వము లేదా స్థానిక లేదా ఇతర ప్రాధికార సంస్థ నుండి సమాచారమును కోరే అధికారము ఉండును.

32. (1) రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా, రాజ్యము లోపల, 31వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచినట్టి కృత్యములను సందర్భోచితముగా నిర్వర్తించుటకు సఫాయి కర్మచారీల రాజ్య కమీషనును లేదా తాను యుక్తమని భావించునట్టి ఇతర శాసనపరమైన లేదా ఇతర ప్రాధికార సంస్థను నియుక్త పరచవచ్చును.

ఈ చట్టపు అమలును పర్యవేక్షించుటకై సముచిత ప్రాధికార సంస్థను నియోగించుట కొరకు రాజ్య ప్రభుత్వమునకు గల అధికారము.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నియుక్తము చేసిన ప్రాధికార సంస్థ, రాజ్యములోపల సంధర్భోచితముగా 31వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచినట్టి సఫాయి కర్మచారీల జాతీయ కమీషను అధికారములను కలిగి ఉండును.

## అధ్యాయము - 8
## వివిధములు

33. (1) పరిశుభ్రం చేయు ప్రక్రియలో విసర్జకాలను తొలగించుటకు హస్త పారిశుద్ధ్య పనిని చేయు అవసరాన్ని నిర్మూలించే ఉద్దేశ్యంతో, తన నియంత్రణలో గల మురుగుపారుదల కాలువలు, మానవ వ్యర్థాల గుంతలను మరియు ఇతర ప్రదేశములను శుభ్రం చేయుట కొరకు తగిన సాంకేతిక ఉపకరణములను వినియోగించుట ప్రతీ స్థానిక ప్రాధికార సంస్థ లేదా ఇతర ఏజెన్సీల కర్తవ్యమై ఉండును.

మురుగు పారుదల కాలువలు మున్నగు వాటిని శుభ్రం చేయుట కొరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమును ఉపయోగించుటకై స్థానిక ప్రాధికార సంస్థలు మరియు ఇతర ఏజెన్సీల కర్తవ్యము.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనట్లుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమును ఉపయోగించడానికి, ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాల ద్వారా ప్రోత్సహించుట సముచిత ప్రభుత్వము యొక్క కర్తవ్యమై ఉండును.

34. ఈ చట్టము క్రింద సద్భావముతో చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన దేనికైనను, సముచిత ప్రభుత్వము లేక సముచిత ప్రభుత్వము యొక్క ఎవరేని అధికారి లేక కమిటి యొక్క ఎవరేని అధికారిపై ఎట్టి దావా, అభియోగము లేక ఇతర శాసనబద్ధ చర్య ఉండదు.

సద్భావముతో తీసుకున్న చర్యకు రక్షణ.

సివిలు న్యాయ స్థానముల యొక్క అధికారితా పరిధికి అడ్డంకి.

35. ఈ చట్టవు ఏదేని నిబంధన వర్తించు ఏదేని విషయమునకు సంబంధించి ఏ సివిలు న్యాయ స్థానమునకు అధికారితా పరిధి ఉండదు మరియు ఈ చట్టముచే లేదా దాని క్రింద చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన దేనిపైనైననూ ఏదేని సివిలు న్యాయ స్థానము ఎట్టి వ్యాదేశమును మంజూరు చేయరాదు.

నియమములు చేయుటకు సముచిత ప్రభుత్వమునకు అధికారము.

36. (1) సముచిత ప్రభుత్వము, అధిసూచన ద్వారా ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి మూడు మాసములకు మించని కాలావధిలోపుగా, ఈ చట్టము యొక్క నిబంధనలను నెరవేర్చుటకు నియమములు చేయవలెను.

(2) ప్రత్యేకించియు మరియు పైన పేర్కొనబడిన అధికారము యొక్క సాధారణ వ్యాపకతకు భంగము వాటిల్లనట్టి నియమములను, ఈ క్రింది అన్ని లేదా ఏవేని విషయముల కొరకు నిబంధించ వచ్చును, అవేవనగా:-

(ఎ) 2వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (డి) క్రింద యజమాని బాధ్యత;

(బి) 2వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండములు (ఇ) మరియు (జి) క్రింద విసర్జకాలను పూర్తిగా క్రుళ్ళిపోవునట్లు చేయు రీతి;

(సి) 4వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) క్రింద అనారోగ్యకరమైన మరుగు దొడ్లను సర్వేను నిర్వహించి మరియు దాని యొక్క జాబితాను ప్రచురణ చేయు రీతి;

(డి) 5వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద అనారోగ్యకరమైన మరుగుదొడ్డిని కూల్చివేయుటకైన నోటీసును ఇచ్చుట మరియు దానికి అయ్యే వ్యయమును వసూలు చేయు పద్ధతి;

(ఇ) 11వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద సర్వే విషయము మరియు పద్ధతి క్రమం;

(ఎఫ్) 11వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4) క్రింద హస్త పారిశుద్ధ్యం చేయువారిని గుర్తించుట కొరకు అర్హతా షరతులు మరియు హస్త పారిశుద్ధ్యం చేయువారిగా పని చేయుచూ కనుగొనబడిన వ్యక్తుల తాత్కాలిక జాబితాను ప్రచురించుట;

(జి) 11వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6) క్రింద హస్త పారిశుద్ధ్యం చేయువారిగా పనిచేయుచూ కనుగొనబడిన వ్యక్తుల తుది జాబితాను ప్రచురించుట;

(హెచ్) 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద లేదా సందర్భానుసారంగా 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పురపాలిక యొక్క ముఖ్య కార్య నిర్వహణాధికారి లేదా ఈ విషయంలో అయనచే అధికారమియబడిన అధికారికి దరఖాస్తు చేయు రీతి;

(ఐ) 13వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) లోని ఉప-ఖండము (ii) క్రింద ఏకకాలిక ప్రారంభ నగదు సహాయ ఏర్పాటు;

(జె) 20వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఇ) క్రింద తనిఖీదారులకైనట్టి ఇతర అధికారములు;

(కె) విహిత పరచబడినటువంటి, కోరబడిన లేక కోరబడు ఏదేని ఇతర విషయము.

(3) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమమును అది చేయబడిన తరువాత వీలైనంత వెంటనే పార్లమెంటు అధివేశనములో ఉన్నపుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటి దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. అట్టి కాలావధి ఒకే అధివేశనములోగాని, వరుసగా వచ్చు రెండు లేక అంత కంటే ఎక్కువ అనుక్రమ

అధివేశనములలోగాని చేరియుండవచ్చును. అది అట్లు ఉంచబడిన అధివేశనము లేదా వెంటనే వచ్చు అధివేశనము లేక అనుక్రమ అధివేశనములు ముగియుటకు పూర్వము ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమమును చేయరాదని ఉభయసదనములు అంగీకరించినచో, అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్పు చేయబడిన ప్రరూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందర్భానుసారముగా ప్రభావరహితమై యుండును; అయినప్పటికినీ, ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని అంతకు పూర్వము ఆ నియమము క్రింద చేయబడిన ఏదేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

(4) ఈ చట్టము క్రింద రాజ్య ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమమును అది చేయబడిన తరువాత వీలైనంత వెంటనే రాజ్య శాసన మండలికి రెండు సదనములు ఉన్న యెడల దాని ప్రతి యొక్క సదనము సముక్షమున మరియు ఒకే సదనము ఉన్న యెడల దాని సముక్షమున ఉంచవలెను.

నమూనా నియమముల చేయుటకు కేంద్ర ప్రభుత్వము యొక్క అధికారము.

37. (1) ఈ చట్టపు 36వ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికినీ:-

(ఎ) కేంద్ర ప్రభుత్వం, అధిసూచన ద్వారా రాజ్యప్రభుత్వములను మార్గ నిర్దేశనం చేయుట కొరకు అవి ఉపయోగించుటకైన నమూనా నియమములను ప్రచురింపజేయ వలెను; మరియు

(బి) చట్టపు 36వ పరిచ్ఛేదము క్రింద నిర్దిష్టపరచిన మూడు మాసముల కాలావధి లోపల, రాజ్య ప్రభుత్వము నియమములు అధిసూచించుటకు విఫలమైన యెడల, రాజ్య ప్రభుత్వము తన నియమములు అధిసూచించు వరకు, కేంద్ర ప్రభుత్వముచే అధిసూచించబడిన నమూనా నియమములు, అట్టి రాజ్యములో, సందర్భోచితముగా అమలులోకి వచ్చినట్లు భావించవలెను.

(2) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన నమూనా నియమములను అవి చేయబడిన తరువాత వీలైనంత వెంటనే పార్లమెంటు అధివేశనములో ఉన్నపుడు మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు దాని ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను. అట్టి కాలావధి, ఒకే అధివేశనములలోగాని, వరుసగా వచ్చు రెండు లేక అంతకంటే ఎక్కువ అనుక్రమ అధివేశములోగాని చేరియుండవచ్చును. అది అట్లు ఉంచబడిన అధివేశనము లేదా వెంటనే వచ్చు అధివేశనము లేక అనుక్రమ అధివేశనములు ముగియుటకు పూర్వము ఆ నియమములో ఏదేని మార్పు చేయుటకు ఉభయ సదనములు అంగీకరించినచో లేక ఆ నియమమును చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినచో, అటు పిమ్మట ఆ నియమము అట్లు మార్పుచేయబడిన ప్రరూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందర్భానుసారముగా ప్రభావరహితమై యుండును; అయిన ప్పటికినీ, ఏదేని అట్టి మార్పుగాని, రద్దుగాని అంతకు పూర్వము ఆ నియమము క్రింద చేయబడిన ఏదేని శాసనమాన్యతకైనను భంగము కలిగించదు.

38. (1) ఈ చట్టపు నిబంధనలను అమలు పరచుటలో ఏదేని ఇబ్బంది ఏర్పడినచో, ఆ ఇబ్బందిని తొలగించుటకు, అవశ్యకమని లేక ఉపయుక్తమని తనకు తోచునట్లుగా ఈ చట్టపు నిబంధనలకు అసంగతము కానట్టి నిబంధనలను కేంద్ర ప్రభుత్వము, రాజపత్రములో ప్రచురించబడిన ఉత్తరువు ద్వారా చేయవచ్చును: ఇబ్బందులను తొలగించుటకు అధికారము.

అయితే, ఈ చట్టము ప్రారంభమైనప్పటి నుండి మూడు సంవత్సరములు ముగిసిన తరువాత ఈ పరిచ్ఛేదము క్రింద అట్టి ఉత్తరువు దేనిని గాని చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి యొక్క ఉత్తరువును, దానిని చేసిన తరువాత వీలైనంత త్వరలో పార్లమెంటు యొక్క ప్రతియొక సదనము సమక్షమున ఉంచవలెను.

మినహాయించుటకు అధికారము.

39. (1) సముచిత ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో ప్రచురింపబడిన సాధారణ లేదా ప్రత్యేక ఉత్తరువు ద్వారా, నమోదు చేయదగిన కారణములు మరియు విధించదగునట్టి షరతులకు అధ్యదీనమై, ఈ చట్టము యొక్క ఏవేని నిబంధనలు లేదా ఈ చట్టము లేదా ఏదేని నియమము, ఉత్తరువు, అధిసూచన, ఉపనియమములు లేదా దాని క్రింద చేయబడిన ఏదేని పథకము నుండి ఏదేని ప్రాంతము, భవనముల శ్రేణి లేదా వ్యక్తుల తరగతిని మినహాయించవచ్చును లేదా కేసుల యొక్క ఒక తరగతి లేదా తరగతులలోని ఏదేని అట్టి అపేక్షితములు యొక్క పాటింపును ఒక పర్యాయములో ఆరు మాసములకు మించనట్టి కాలావధికి వర్తింపకుండా చేయవచ్చును.

(2) ఈ చట్టము క్రింద చేయబడిన ప్రతి సాధారణ లేదా ప్రత్యేక ఉత్తరువును అది చేయబడిన తరువాత వీలైనంత వెంటనే పార్లమెంటు ఉభయ సదనములు మరియు రాజ్య శాసనమండలికి రెండు సదనములు ఉన్న యెడల దాని ప్రతి యొక్క సదనము సముక్షమున మరియు ఒకే సదనము ఉన్న యెడల ఆ సదనపు సముక్షమున ఉంచవలెను.

Printed and Published by the Commissioner of Printing, Government of Telangana at Government Central Press, Chanchalguda, Hyderabad.